క్లుప్తంగా

ఘనంగా అన్న సమారాధన

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లో వేంచేసియున్న శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో 34వ శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయం వద్ద భక్తులకు ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో ధర్మకర్త మేడి త్రిమూర్తులు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చెర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు మాట్లాడుతూ 34వ సంవత్సరం ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన సాయి, చైతన్య నగర్ పెద్దలకు, స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు.

సినిమాలు



శ్యామల	: వేట్టయన్
సూర్యమినీ	: జనక అయితే గనక
సూర్యప్యాలెస్	: వెనమ్
శివజ్యోతి	: పొట్టేల్
అనుశ్రీ	: వెనమ్
స్వామి	: వెనమ్
అశోక	: విశ్వం
రాజా	: వెనమ్
రంభ	: సత్యం సుందరం, ఎంతపనిచేసావురా చంటి
ఊర్వశి	: లగ్గం
మేనక	: నరుడి బ్రతుకు నటన
కుమారి	: దేవర
అప్సర	: దేవర
నామవరం	
వీఎస్.మహల్	: వెనమ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: వెనమ్
కడియం:	
వెంకటసూర్య	: వెనమ్

7న క్యాన్సర్ అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం, నివారించడం, చికిత్స చేయడం గురించి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా నవంబర్ 7న రాజమహేంద్రవరం కోటగుమ్మం సెంటర్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమావేశ మందిరంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, అధికారులతో నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా చేపట్టే కార్యక్రమాలపై సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వాలు పెంచే చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సెక్రటరీ జక్కంపూడి విజయలక్ష్మి, డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వెండింగ్ జోన్స్ గుర్తించండి

కమిషనర్ కేతన్ గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో వీధి వ్యాపారులను గుర్తించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా వ్యాపారాలను నిర్వహించుకొనేలా స్ట్రీట్ వెండింగ్ జోన్స్ గుర్తించాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పట్టణ ప్రణాళికా విభాగం కార్యకలాపాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెప్మా విభాగం గతంలోనే వీధి వ్యాపారులను గుర్తించడం కోసం సర్వే నిర్వహించిందని వారి వద్ద వివరాలు తీసుకొని వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు తమ వ్యాపారాలను నిర్వహించడం కోసం వెండింగ్ జోన్స్ గుర్తించాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను నగరపాలక సంస్థ నిర్దేశించిన చోట మాత్రమే వేయాలని, భవనాన్ని పడగొట్టిన తరువాత ఆ వ్యర్థాలను రోడ్డు మీద వేయకుండా చూడాలన్నారు. ఇసుక, ఇటుకలు తదితరాలను కూడా రోడ్డుకు అడ్డంగా వేయకుండా ప్లానింగ్ సెక్రటరీ నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎవరైనా రోడ్డు మీద వ్యర్థాలను వేసినా, భవన నిర్మాణానికి ఉపయోగించే ఇసుక, ఇటుకలు, కంకర తదితరాలను రోడ్డుపై నిల్వ చేసినా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో ప్రధాన రహదారుల్లో ఆక్రమణలను తొలగించే కార్యక్రమం కొనసాగించాలన్నారు. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని విమానాశ్రయం నుంచి పుష్కర ఘాట్ వరకు వున్న ఆక్రమణలపై దృష్టి సారించాలని సూచించారు. నగరంలో సర్వే నిర్వహించి అధికార, అనధికార హోర్డింగులను గుర్తించి, నివేదిక తయారు చేయాలని, దాని ఆధారంగా అనధికార హోర్డింగులను క్రమబద్ధీకరించి ప్రకటన పన్ను వసూలు చేయాలని అన్నారు. క్రమబద్ధీకరించే అవకాశం లేని వాటిని తొలగించాలని ఆదేశాలిచ్చారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ కోటయ్య, డీసీపీ సత్యనారాయణరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సూర్యకాంతం శతజయంతి ఉత్సవాలు



సూర్యకాంతంకు నివాళులర్పిస్తున్న మరిదయ్య తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక అశోక థియేటర్ ఆవరణలో అక్కినేని అభిమాని అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో ఆంధ్రుల అత్త సూర్యకాంతం శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఏఎన్ఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిశెట్టి ఆనంద్ పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అక్కినేని అభిమాని, రాజకీయ సినీ విశ్లేషకుడు మరిడయ్య మాట్లాడుతూ గుండమ్మకథ చిత్రంలో గయ్యాళి అత్త పాత్రలో సూర్యకాంతం నటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆమె గయ్యాళి అత్త పాత్రలు పోషించినప్పటికీ మనస్సు మాత్రం వెన్న అని, సినిమా షూటింగ్‌ల సమయంలో పెద్ద క్యారేజీలతో భోజనాలు తీసుకువెళ్లి అందరికి అందజేసేవారన్నారు. మిర్తిపాటి శేషగిరిరావు, సుక్కిరెడ్డి శ్రీనివాసరావు, సాకినేని మల్లికార్జునరావు, నిమ్మలపూడి గోవిందు, జి.నాగరాజు, కనిశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

మహిళా విభాగం నియామకం

సీటీఆర్‌ఐ: ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం డివిజన్ శాఖ, కొవ్వూరు డివిజన్ శాఖకు మహిళా కమిటీలను నియమించామని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ పారె లక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ సమావేశ కార్యాలయంలో ఈ నియామకం జరిగింది. 8 మందితో కూడిన మహిళా విభాగాన్ని ఏర్పాటు చేశారు. అమరావతి మహిళా విభాగం తూర్పుగోదావరి జిల్లా శాఖ చైర్‌పర్సన్ నాగలక్ష్మి , కమిటీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి



వర్క్‌షాపులో విద్యార్థులతో అధ్యాపకులు

కంబాలచెరువు: విద్యార్థులు విద్యతోపాటు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రన్ ఆర్‌కే విద్యార్థులకు సూచించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'విజన్ టూ వీడియో: స్టూడెంట్ వీడియో ప్రొడక్షన్' అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం వీడియోలను ఉపయోగించడమే కాకుండా వీడియోలను తయారుచేసే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ డి.చెన్నారావు, ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకుడు బి.వెంకటరావు రిసోర్సు పర్సన్స్‌గా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ బి.ప్రతిమ కన్వీనర్‌గా వ్యవహరించారు. వెంకటరావు ఈ కార్యక్రమంలో విద్యార్థులలో ఈ-పాఠ్యాంశాల తయారీ నైపుణ్యాల అభివృద్ధి గురించి చర్చించారు. వీడియో తయారీ అనేది విద్యార్థులలో ఆలోచనా, భావ వ్యక్తీకరణ సామర్థ్యాలను పెంచి తద్వారా విద్యార్థుల వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధికి దోహదం చేస్తుందని కన్వీనర్ డాక్టర్ బి.ప్రతిమ అన్నారు. వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.రాజేశ్వరి, వాణిజ్య శాస్త్ర, ఇతర విభాగ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సుబ్బారాయుడు మృతి



రాజమహేంద్రవరం రూరల్: కాతేరు మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత ఆచంట వెంకట సుబ్బారాయుడు(70) శుక్రవారం నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందారు. ఆయనకు భార్య లక్ష్మీబంగారం, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుబ్బారాయుడు సర్పంచ్‌గా పనిచేసిన ఐదేళ్లకాలంలో గ్రామాభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. కాతేరులోని ఆయన స్వగృహంలో సుబ్బారాయుడు పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల నేతలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలు శనివారం ఉదయం 9.00 గంటలకు కోటిలింగాలరేవులోని శ్మశానవాటికలో నిర్వహించనున్నట్లు సొసైటీ మాజీ అధ్యక్షుడు ఆచంట కళ్యాణ్ తెలిపారు.

ఇంటింటికీ మంచినీటి కుళాయి

ధవళేశ్వరం: జలజీవన్ పథకం ద్వారా ఇంటింటికి మంచినీటి కుళాయి ఇచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. ధవళేశ్వరంలో పల్లె పండుగ వారోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. రూ.50 లక్షలతో ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్మించనున్న లాబోరేటరీ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో రూ.1.10కోట్లతో నిర్మించనున్న రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గ్రామంలో త్వరలోనే అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని, రైతు బజార్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఎంపీడీవో డి శ్రీనివాసరావు, తహసీల్దార్ కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ పాల్గొన్నారు.

• పొంచి ఉన్న ముప్పు



ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ

పిడింగొయ్యి గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటగిరి-2 కాపాశ్రీను హోటల్ దగ్గర డ్రైనేజీపై శ్లాబు దెబ్బతింది. రాత్రి వేళ ఈ రోడ్డులో వెళ్లేవారు డ్రైనేజీలో పడిపోయే ప్రమాదం ఉందని గుర్తించిన స్థానికులు రేకులు, ఇతర వస్తువులు డ్రైనేజీపై తాత్కాలికంగా కప్పుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీపై శ్లాబు వేయించాలని కోరుతున్నారు. – రాజమహేంద్రవరం రూరల్

నేడు, ఎల్లుండి విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: బొమ్మూరు నుంచి కొండగుంటూరు వరకు ప్లాంథెర్ కండక్టర్ మార్పే క్రమంలో శనివారం, సోమవారం రాజమహేంద్రవరం డివిజన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ శుక్రవారం ప్రకటించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలిగే అంతరాయంతో ఓల్డ్ బొమ్మూరు, మురళికొండ, సోమనవారి తోట, జీపీఆర్ రోడ్డు ,ఏఎంజీ కాలేజీ వెనుక ప్రాంతాలలో ప్రభావం ఉంటుందన్నారు.

జాబ్‌మేళాలో 17మంది ఎంపిక

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 59 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 17మంది ఎంపికయ్యారు. ఈ జాబ్‌మేళాలో మూడు కంపెనీలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ హరిశ్చంద్ర ప్రసాద్, జిల్లా నైపుణ్యాధికారి గంటా సుధాకర్, ఏడీఎస్‌డీవో పెరుమాళ్, కళాశాల ట్రైనింగ్ ఆఫీసర్ పి.వి షణ్ముబాబు, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ సురేష్ గండి, జిల్లా నియామక అధికారి డి.పావనిప్రియ పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభలో 28 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్: రెవెన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ డిప్యూటీ తహసీల్దార్ ఎ.రాజాబాబు రైతులకు సూచించారు. శుక్రవారం తొర్రేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. గ్రామసభలో రైతుల నుంచి 28 అర్జీలు వచ్చాయని డిప్యూటీ తహసీల్దార్ రాజాబాబు తెలిపారు. సర్వేయర్ భువనేశ్వరరావు, వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన ఎస్‌ఫీఎఫ్ దళం



క్రీడాకారులను అభినందిస్తున్న జోన్ కమాండెంట్ నరసింహారావు

ప్రకాశం నగర్ : ఏపీ ప్రత్యేక రక్షణ దళం 33వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుంటూరులోని అచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో రాజమహేంద్రవరం జోన్ ఎస్‌పీఎఫ్ క్రీడాకారులు వివిధ క్రీడాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్టు ఏపీ రాజమహేంద్రవరం జోన్ ఎస్‌పీఎఫ్ కమాండెంట్ కొండా నరసింహారావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో క్రీడాల్లో ప్రతిభ చాటిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు ప్రసాదరావు, శ్రీనివాసరావు, కృష్ణయ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కడియం: ఉద్యోగులకు సంబంధించిన పలు బిల్లుల చెల్లింపులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిని తక్షణం చెల్లించాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులిదిండి రవికుమార్ ఒక ప్రకటనలో కోరారు. వైద్య ఆరోగ్య శాఖలో ముఖ ఆధారిత హాజరు (ఎఫ్ ఆర్ఎస్) ను స్వాగతిస్తున్నామని, కానీ కొన్ని ప్రాంతాలలో ఇంటర్నెట్ స్పీడు బహు తక్కువగా ఉండడం, కొన్ని సందర్భాలలో సిగ్నల్స్ కూడా లేకపోవడం వంటివి పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైద్యులు, వైద్య ఉద్యోగులు ఇన్ కమింగ్ సమయంలో కనీసం 30 నిమిషములు అయినా గ్రేస్ పీరియడ్ ఇవ్వాలన్నారు. ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియ వెంటనే చేపట్టాలని కోరారు.

ఓటు నమోదు చేసుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రతి గ్రాడ్యుయేట్ విధిగా ఓటు నమోదు చేసుకోవాలని కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ కు అఖండ విజయాన్ని అందించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కోరారు. స్థానికంగా ఓ హోటల్‌లో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఎం.పీ.పీ వెలుగుబంటి ప్రసాద్, టూరిజం డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబులతో కలిసి సమావేశం నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కంబాలచెరువు: తాడితోట టీవీఎస్ షోరూమ్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతడు గురువారం రాత్రి రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. వెంటనే అంబులెన్స్ లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని భావిస్తున్నారు. అతడి ఆచూకీ తెలిసిన వారు ఒకటో పట్టణ పోలీసులను సంప్రదించాలి.

పట్టపగలే చోరీ

మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం పట్టపగలు ఇంటిలో చోరీ జరిగింది. లూథర్‌గిరిలో నివాసముంటున్న బి.సుదర్శన్ కుమార్ పేపర్‌మిల్లులో పనిచేస్తుంటాడు. అతడి తల్లి స్కూలులో వంట మనిషిగా, చెల్లి ఆసుపత్రిలోనూ పనిచేస్తున్నారు. వీరందరూ ఉదయం డ్యూటీలకు వెళ్లిపోయారు. సుదర్శన్ కుమార్ మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తీసిఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువాలోని 40 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండిని దొంగలు పట్టుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

కడియం: రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి సిబ్బంది కృషి చేయాలని జేసీ చిన్నరాముడు అన్నారు. మండలంలోని వేమగిరిలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించారు. అర్జీలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంతకుముందు కడియం తహసీల్దార్ కె.పోసిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో స్థానికుల నుంచి పలు అర్జీలను స్వీకరించారు.